# అటవీశాఖ అధికార్లకు తుపాకులు : ఆత్మకూరు అడవుల్లో శవాలు

అటవీ సంపదను కాపాడటానికి, వన్యప్రాణులను కాపాడటానికి (తమ ప్రాణాలను కాపాడుకోవడానికి) కాల్పులు జరిపే అధికారాన్ని అటవీశాఖ అధికార్లకు దత్తంచేసే జి.వో ఒకటి 1991లో మన రాష్ట్రంలో జారీ అయ్యింది. కనీసం అసెంబ్లీలో చర్చ జరపకుండా, బిల్లు రూపంలో ప్రతిపాదించి చట్టం చేయకుండా, మనుషుల్ని చంపే అధికారం జి.వో ద్వారా ఇవ్వడమేమిటని మీకు ఆశ్చర్యం కలగొచ్చు. ఆశ్చర్యపడవలసిన విషయం అదొక్కటే కాదు. జి.వో లో ఇంకా చాలా ఉన్నాయి.

రాష్ట్ర ప్రధాన చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (అటవీ శాఖ ఉన్నతాధికారి) 1991 జూలై 24న జారీ చేసిన జి.వో. ఎం.ఎస్ 182 ఏమంటుందంటే అటవీ సంపదను దొంగిలించేవాళ్ళు, వన్యప్రాణులను చంపేవాళ్ళు ఈ మధ్యకాలంలో ఆధునిక ఆయుధాలతో తిరుగుతున్నారు. దాని వలన అటవీశాఖ అధికార్ల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. అందువల్ల ప్రాణరక్షణ కోసం, అటవీ సంపదను కాపాడటం కోసం కాల్పులు జరిపే అధికారం అటవీశాఖ అధికార్లకు ఇచ్చి తుపాకులు ఇవ్వవలసిన అవసరం ఉంటుంది. దొంగిలించిన అడివి సంపదను జప్తు చేసుకొనేటప్పుడు, నేరస్తులను అరెస్టు చేసేటప్పుడు ప్రతిఘటించడం జరిగితే అటవీ అధికార్లు భారత శిక్షాస్మృతిలోని ఆత్మరక్షణ సెక్షన్ల క్రింద కాల్పులు జరపడానికి తుపాకులు యివ్వాలంటుంది. అయితే జనావాసాలలో, గ్రామాలలో, అడవులలో, అటవీ సంపదవున్న ఇతర ప్రాంతాలలో మాత్రమే కాల్పులు జరిపే అధికారాన్ని వినియోగించుకోవాలని అంటుంది. ఎప్పుడెప్పుడు కాల్పులు జరుపవచ్చునవే దానికి ఏడు ఉదాహరణలు జి.వో. యిస్తుంది. (అనుబంధం, III (4) )

1. మారణాయుధాలు ధరించి అటవీ సంపద దొంగిలించేస్తున్న వాళ్ళను అధికారులు సరండర్ కమ్మంటే, వాళ్ళుకాకపోతే
2. విలువైన అటవీసంపదను ఆయుధాలు ధరించినవారు నెత్తిమీద గానీ, వాహనాలమీదగానీ తీసుకుపోతూ ఆగమంటే ఆగకపోతే
3. వన్యప్రాణులను హతమార్చేవారు ఆపనిలో నిమగ్నమై ఉన్నప్పుడు లేదా చంపిన జంతువులను తరలించే పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు అటవీ అధికార్లు ఆగమనీ, చంపిన జంతువును ఇచ్చేయమనీ ఆదేశిస్తే ఆగకపోతే
4. బయటివారు వేటకోసం ఆయుధాలతో అడవిలోకి ప్రవేశించి అటవీ శాఖవారు ఆయుధాలు అప్పగించమని ఆదేశిస్తే అప్పగించకపోతే
5. నేరస్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండి అటవీ అధికారుల ప్రాణాలకు గానీ, ఆయుధాలకుగానీ తక్షణ ప్రమాదం ఏర్పడితే
6. నేరస్తులు అటవీ అధికారులను ఆయుధాలతో చుట్టుముట్టడం వలన అధికారుల ప్రాణాలకు గానీ, ఆయుధాలకు గానీ తక్షణ ప్రమాదం ఏర్పడితే
7. నేరస్తులు ఒక అటవీ అధికారిని బందీగా తీసుకోవడం జరిగితే, వెంటనే సహాయాన్ని పిలిపించి తమ సహచరుడిని రక్షించడం అధికార్లకు సాధ్యం కానప్పుడు.

ఇన్ని సందర్భాలలో కాల్పులు జరుపవచ్చునని జి.వో. అంటుంది. ఇక్కడ గమనించవల్సిన విషయాలు చాలా ఉన్నాయి. ఈ వివరణలో 'ఆయుధం' అంటే ఏమిటని నిర్వచనం లేదు. 'టాడా' లాంటి చట్టం సహితం తుపాకులను, గ్రెనేడ్లను, బాంబుల వంటి ఆధునిక ఆయుధాలనే పేర్కొనింది. ఈ జి.వో. అటువంటి వర్గీకరణ చేయలేదు. అడవిలో బ్రతికే జనం నిత్యం ఉపయోగించే గొడ్డళ్ళు, కొడవళ్ళు, పలుగులు, బాణాలు, చివరికి దుడ్డుకర్రలు కూడా ఈ జి.వో. దృష్టిలో ఆయుధాలే. జి.వో. మొదట పేరాలో ఆయుధాలు ఉపయోగించేవారు ఈ మధ్యకాలంలో ఆధునిక ఆయుధాలు ధరించి తిరుగుతున్నారు కాబట్టి వారినుండి అటవీ సంపదను కాపాడటానికి అటవీ అధికారులకు కూడా ఆయుధాలు కావాలని వివరణ రాసారు. కానీ ఆ వివరణలో పేర్కొన్న 'ఆధునిక ఆయుధాల ప్రస్తావన తక్కిన జి.వో.లో ఎక్కడా లేదు. అడవిలో కర్ర కొట్టుకొని భుజాన గొడ్డలి వేసుకొని పోతున్న గిరిజనులను రేంజర్ లొంగిపొమ్మంటే వాళ్ళు లొంగిపోకపోతే రేంజర్‌గారు కాల్పులు జరపవచ్చునన్న మాట.

ఇది ఊహకాదు. ఈ జి.వో. ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకొని కర్నూలు జిల్లా ఆత్మకూరు ప్రాంతంలో అటవీ అధికారులు ఇప్పటికి ఇద్దరిని కాల్చేసారు. వాళ్ళు ఆధునిక ఆయుధాలు పట్టుకొని అడవిని దోచుకుంటున్న బడాస్మగ్లర్లు కారు. ఆ పని చేస్తున్న రాజకీయ నాయకులు, అధికారులు చాలామంది ఈరాష్ట్రంలో ఉన్నారు. రాయలసీమకు చెందిన ఫ్యాక్షన్ నాయకులు, రాజకీయనాయకులలో చాలామంది నల్లమల అడవులలో కట్టెను దొంగతనంగా తరలించి కోటీశ్వరులైన వారే. వాళ్ళలో ఒకరు ప్రస్తుత హోం మంత్రి మైసూరారెడ్డిగారు. ఆదిలాబాద్ అడవుల టేకు కలప కోట్లు విలువ చేసేది లక్సెట్టిపేటలో కాంగ్రెస్ నాయకుడు జి.వి. సుధాకరరావు ఇంటి పెరట్లో 10 సంవత్సరాల క్రితం దొరికింది. ఖమ్మం అడవులనుండి కాబోలు ఈమధ్య చనిపోయిన పోలీస్ అధికారి వ్యాస్ పురమాయింపుతో దొంగకట్టె తీసుకుపోతున్న లారీ ఆరేడేళ్ళ క్రింద పట్టుబడింది. ఈ కోవకు చెందిన పెద్దల జాబితా చాలా పెద్దదే.

ఆత్మకూరు అడవులలో జి.వో.ఎం.ఎస్. 182 పుణ్యాన ప్రాణాలు కోల్పోయింది వీరుకారు. ఇద్దరు సెటిల్‌మెంట్ వడ్డెరలు. స్టువర్ట్‌పురం, చిట్టగుంట సెటిల్‌మెంట్లలాగా ఆత్మకూరు సమీపంలో సిద్ధాపురం అని ఒక వడ్డెర సెటిల్‌మెంటు వుంది. ఈ సెటిల్‌మెంటువాసులు క్రమంగా దొంగతనాలు మానుకొని పనిచేసుకొని బ్రతకటం నేర్చుకుంటున్నారనీ, మహా అయితే అడవిలో కలపముట్టుకు దొంగిలించి అమ్ముకుంటారనీ పోలీసులు సహితం అంటున్నారు. ఈ కలప స్మగ్లింగ్ పెద్ద ఎత్తున వేయడానికి కావలసిన సంబంధాలు, స్తోమత వాళ్ళకు లేవు. చేస్తే 'సంసారపక్షంగా' చేసుకుంటారు. లేకపోతే ఆత్మకూరులో నివసించే 'పెద్దమనుషులకు' ఏజెంట్లుగా స్మగ్లింగ్ చేస్తారు. ఏ రకంగా చూసినా అడవుల నాశనానికి వీళ్ళను పెద్దకారణంగా భావించనవసరం లేదు. కానీ పెద్ద కారణం అయిన వాళ్ళు సమాజంలో పెద్దలయినప్పుడు జి.వో.ఎం.ఎస్. 182 ప్రతాపాన్ని ప్రయోగించగలిగింది చిన్నవాళ్ళమీదనే. జీ.వో. కూడా అందుకు అనుకూలంగానే ఉంది. కాల్పులు జరపగల సందర్భాలుగా జి.వో.లో పేర్కొన్న 7 పరిస్థితులను ఒకసారి తిరిగి చదవండి. 'నేరస్తులు' అన్నచోట సిద్ధాపురం సెటిల్‌మెంట్ వడ్డెరలను, 'ఆయుధం' అన్నచోట గొడ్డలినీ కొడవలినీ ఊహించు కోండి – మీకే అర్థం అవుతుంది.

1992 మార్చి 15వ తేదీ కర్నూలు - గుంటూరు రాష్ట్ర రహదారి పక్కన పోతరాజుపెంట సమీపంలో వేముల మల్లయ్య అనే సిద్దాపురం నివాసిని అటవీశాఖ అధికారులు కాల్చిచంపారు. 14వ తేదీన మల్లయ్యతో సహా 12 మంది (ఏడుగురు మగవాళ్ళు, అయిదుగురు ఆడవాళ్ళు) బండ్లు వేసుకొని అడవిలోకి వెళ్ళారు. వాళ్ళు కట్టె తెస్తుండగా అటవీశాఖ అధికార్లు ఎదురయి ఆటంకపరిచారు. వీళ్ళు తిరగబడి అధికారులను కొట్టారు. అప్పటికి అధికారుల చేతిలో తుపాకులు లేవు కాబట్టి వాళ్ళు పారిపోయి మరుసటి రోజు పొద్దున్న తుపాకులు తీసుకుని బయలుదేరారు. వాళ్ళు కర్నూలు - గుంటూరు రహదారి మీదుగా ఆత్మకూరు దాటి కొంతదూరం వచ్చేసరికి మల్లయ్య బృందం బండ్లు రోడ్డుపక్కన కనబడ్డాయి. వెనక్కితిప్పి ఆత్మకూరుకు పదండి అని అధికార్లు హెచ్చరించారు. మల్లయ్య 'మేము రాముపొమ్మన్నాడు. అంతే తప్ప ముందురోజు లాగా దాడిచేయలేదు. అధికార్లకు అపాయం కలిగించలేదు. అయినప్పటికీ వాళ్ళు తుపాకులతో నేరుగా కాల్పులు జరిపారు. మల్లయ్య గాయపడి క్రిందపడిపోగా మిగిలినవాళ్ళు చెదిరిపోయారు. మల్లయ్యను అటవీ అధికారులు ఆత్మకూరుకు తెచ్చేసరికి చనిపోయాడు. దారిలో కత్తితో పొడిచి చంపారని బంధువులు ఆరోపణ. గమనించదగ్గ విషయం ఏమిటంటే అటవీశాఖ అధికారులు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చిన రిపోర్టులో మల్లయ్య తమమీద ఈ దినం దాడి చేసి ప్రాణాపాయం కలిగించాడని చెప్పలేదు. నిన్నదాడి చేసాడనీ, ఈ దినం వెనక్కి తిరగడానికి నిరాకరించగానే కాల్పులు జరిపామనీ అన్నారు. ముందురోజు ప్రాణాపాయం నిజంగానే కలిగిందనుకున్నా, ప్రాణాపాయం కలిగిన 24 గంటలకు 'ఆత్మరక్షణ' కోసం కాల్పులు జరపడం చాలా కొత్త విషయం. అయినా వాళ్ళ చర్య ప్రతీకారం తప్ప ఆత్మరక్షణ కాదని వాళ్ళ కథనమే చెప్తుంది. ముందురోజయినా, ఆ రోజయినా మల్లయ్య బృందం దగ్గర కొడవళ్ళు, గొడ్డళ్ళు తప్ప వేరే ఆయుధాలేమీ లేవనేది కూడా వాళ్ళ కథనం నుండే స్పష్టం అవుతుంది. మొదటి దినం వాళ్ళు చేసింది నేరమే. కానీ ఆనేరానికి శిక్ష ఏమిటి? ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తే పోలీసులు అరెస్టు చేయకపోదురా? ప్రతీకారచర్యగా కాల్చిపారేసి జి.వో.ఎం.ఎస్. 182ను అడ్డం పెట్టుకోవడం క్షమించదగ్గ చర్యా?

రెండవ సంఘటన మరీ ఘోరమయినది. ఇదే సిద్దాపురం సెటిల్‌మెంట్‌కు చెందిన తమ్మిశెట్టి చిట్టిబాబును 1992 ఆగస్ట్ 21వ తేదీన ఆత్మకూరు సమీపంలోని బైర్లూటి దగ్గర రేంజర్ రామయ్య కాల్చి చంపాడు. రామయ్య ఆత్మకూరు రేంజర్‌గా పదవిచేపట్టిన నాటినుండి సిద్దాపురం వడ్డెరలను లంచాలకోసం చాలా వేధిస్తున్నాడు. అంతకు ముందు ఉన్న రేంజర్ లంచాలు తీసుకొనేవాడు కాడనీ అందువల్ల ఇతనికి ఇవ్వడానికి తమకు ఇష్టం లేదనీ వడ్డెరలు అంటారు. అందులో చిట్టిబాబు ఊరిలో ఒక పెద్దమనిషిగా ఈ విషయంలో గట్టిగా నిలబడ్డాడు. రామయ్య ఆ కోపం మనసులో పెట్టుకున్నాడు.

చిట్టిబాబుకు లేకలేక కొడుకుపుట్టగా అతను మొక్కు తీర్చుకోవడం కోసం ఆగస్ట్ 22న తేదీన శ్రీశైలం పోవాలని నిర్ణయం చేసుకున్నాడు. ఆప్రాంతంలో ఉన్న ఆచారం ప్రకారం ముందురోజు బైర్లూటి సమీపంలోని ముర్తుజావలీ దర్గాకు పోయాడు. పోతుండగా వారిలో రేంజర్ రామయ్య ఇతనిపైన నేరుగా కాల్పులు జరిపాడు. అతనితో ఉన్నవాళ్ళు అతని గాయానికి ఆకులుకట్టి ఆత్మకూరుకు తీసుకుపోయారు. కానీ ఆస్పత్రి చేరుకునే లోపల అతను చనిపోయాడు. రేంజర్ రామయ్య కథనం ఏదయినా తక్కిన వాళ్ళందరి కథనం ఒక్కటే, కాల్పులు జరిగినప్పుడు చిట్టిబాబు దొంగకట్టె తీసుకుపోవడంలేదు. దర్గాకు పోతున్నాడు. అతని చేతిలో ఏ రకమయిన ఆయుధం లేదు. కొబ్బరికాయ మట్టుకు ఉంది.

జి.వో. ఎం.ఎస్. 182 ఇన్ని రకాలుగా ఉపయోగపడుతున్నది.

పోలీసులు రేంజర్ రామయ్య మీద కేసుపెట్టలేదా అని మీరు అడుగుతారేమో. వాళ్ళకు పెట్టాలని ఉన్నా పెట్టడానికి వీలులేదు. జి.వో.ఎం.ఎస్. 182 అనుబంధం సెక్షన్ 7 ఏమంటుందంటే కాల్పులు జరిపి హత్య చేసినందుకుగానీ గాయపరిచినందుకుగానీ పోలీసులు అటవీశాఖ అధికారులను అరెస్టు చేయడానికి వీలులేదు. కనీసం ప్రశ్నించడానికి వీలులేదు. వాళ్ళు చంపేసి రిపోర్ట్ ఇస్తే దానిని తీసుకోవాలి. పంచనామా, శవపరీక్ష జరిపించాలి. అంతా అయినాక అన్ని రిపోర్టులూ కట్టగట్టి జిల్లా కలెక్టర్‌కు పంపించాలి. వారు ఆర్.డి.వో. చేత మెజిస్టీరియల్ విచారణ జరిపించాలి. ఆ విచారణలో కాల్పులు అనవసరంగా జరిపారని తేలితే అప్పుడు ఆ నివేదికను ప్రభుత్వం పరిశీలించిన పిదప సంబంధిత అటవీశాఖ అధికారి పైన కేసుపెట్టడం జరుగుతుంది. అయితే మెజిస్టీరియల్ విచారణ నివేదిక అధికారిని తప్పుపట్టినా సరిపోదు. అనుబంధం సెక్షన్ 10 ప్రకారం, నివేదికను పరిశీలించిన పిదప ప్రభుత్వం ఆ అభిప్రాయానికి రావాలి. కాల్పులు అనవసరంగా జరిపారని మెజిస్టీరియల్ విచారణ నివేదిక నిర్థారించినా, దానిని ప్రభుత్వం 'పరిశీలించే' క్రమంలో కాల్పులు సక్రమంగా జరిగాయని తేలవచ్చు. అప్పుడంతా సాఫీయే.

విధినిర్వహణ పేరిట హత్యచేసినా ప్రభుత్వం అనుమతి లేకుండా కేసుపెట్టడానికి వీలులేదనే సంరక్షణ ఇప్పటిదాకా సైనిక అధికారులకు పోలీసులకూ ఉంది. ఇప్పుడు తుపాకులతోపాటు ఆ సంరక్షణ అటవీశాఖ అధికారులకు కూడా సంక్రమించింది. జీవించే హక్కుకు ఎటువంటి మినహాయింపులు ఉండడానికి వీలులేదని అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికలు నిర్ద్వంద్వంగా అంటాయి. విధి నిర్వహణ పేరిట పోలీసులూ సైనికులూ హత్యలు చేస్తే అందరు పౌరులలాగా వాళ్ళను కూడా శిక్షించకుండా 'ప్రభుత్వం అనుమతి లేకుండా వారిపైన నేరవిచారణ జరగదు' అని సంరక్షణ కల్పించినంత కాలం పౌరుల జీవించే హక్కుకు పరిమితులు ఉన్నట్లే అవుతుంది. అందువల్లనే సాయుధ బలగాలకు చట్టంలో కల్పించిన ఈ సంరక్షణను తొలగించమని అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఆ పని చేయకపోగా ఇప్పుడు మరి కొందరు ప్రభుత్వ అధికారులను కొత్తగా సాయుధులను చేసి వాళ్ళకు కూడా మన రాష్ట్ర ప్రభుత్వం అదే సంరక్షణ కల్పించింది. అదికూడా రాష్ట్ర అసెంబ్లీకి ప్రజలకూ పత్రికలకూ తెలియకుండా ఒక జి.వో. ద్వారా చేసింది.

'చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప ఇతరత్రా ఎవరి ప్రాణం తీయడానికి వీలు లేదు' అని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 అంటుంది. ఆ చట్టం న్యాయంగా, నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా ఉండాలి తప్ప ఎట్లనడితే అట్ల ఉండడానికి వీలులేదని 1978 తరువాత సుప్రీంకోర్టు చాలా తీర్పులలో చెప్పింది. ఈ జి.వో.లో కొత్తగా ఇచ్చిన కాల్పులు జరిపే అధికారం న్యాయంగా, హేతుబద్ధంగా ఉందా? చేతిలో గొడ్డలి, నెత్తిమీద కట్టెమోపు పట్టుకొని పోతున్న వ్యక్తిని ఆగమంటే ఆగకపోతే కాల్చిపారేయొచ్చుననడం న్యాయమైన అధికారమా? కట్టెమోపులు మోసుకుపోతున్న వాళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఒక్కడుగా ఉన్న అటవీ అధికారికి వారి వల్ల ప్రమాదం రాగలదు కాబట్టి ముందుగానే

కాల్పులు జరిపి చంపవచ్చుననే అధికారం హేతుబద్ధమయినదా? అసలు చూడగానే వాళ్ళు 'నేరస్తులు' అని ఎట్లా తెలుస్తుంది? వాళ్ళ నెత్తిమీదున్నది ఎండుకట్టెల మోపు కాదనీ చట్ట విరుద్ధంగా పచ్చి కట్టె కొట్టి తీసుకుపోతున్నారనీ తెలుసుకునే దివ్యజ్ఞానం అటవీ అధికారులకు ఉందా?

జీవించే హక్కు భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు అయినప్పుడు దానిని తొలగించే అధికారాన్ని కట్టబెట్టే శాసనాన్ని జి.వో. రూపంలో జారీ చేయడం సబబేనా? ఆ రకంగా జి.వో. రూపంలో జారీ అయిన అధికారం రాజ్యాంగ బద్ధమేనా? రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విరుద్ధమయిన చట్టం చెల్లదని ఆర్టికల్ 13 అంటుంది. అటవీ అధికారులకు ఇచ్చిన ఈ కొత్త అధికారాన్ని బిల్లు రూపంలో అసెంబ్లీలో ప్రవేశపెడితే దానిని కనీసం ప్రభుత్వ న్యాయ నిపుణులు, ప్రభుత్వేతర నిపుణులు పరిశీలించి దానికి ఆర్టికల్ 13 వర్తిస్తుందో లేదో నిర్ణయించే అవకాశం ఉండేది. ఆ అవకాశం లేకుండా జి.వో. రూపంలో జారీ చేసే పద్ధతే రాజ్యాంగ విరుద్ధం కాదా? ఆస్తినీ ప్రాణాన్నీ రక్షించడం కోసం, నేరాలను నిరోధించడం కోసం కాల్పులు జరిపే అధికారాన్ని పోలీసులకు బ్రిటిష్ హయాంలో రాసిన భారత శిక్షాస్మృతి ఆనాడే ఇచ్చింది. కానీ 130 ఏళ్ళ క్రింద రాసిన ఆ చట్టం ఏ నేరాన్ని నిరోధించడానికి ఎంత బలప్రయోగం చేయవచ్చునని చాలా వివరంగా నిర్దేశించింది. ఈ జి.వో.లో అటువంటిదేం లేదు. 'కాల్పులు జరపటం నేరాన్ని అరికట్టడానికే తప్ప ప్రాణం తీయడానికి కాదు' అని టోకుగా అన్నారు గానీ (అనుబంధం, III (5)) ప్రాణం పోవడానికి వీలు లేదని అనలేదు. తీసుకుపోతున్నది ఒకటేకుమొక్కయినా ఒక హెక్టారు టేకుతోటయినా ఒకటే. తీసుకు పోతున్న వ్యక్తి తిండికి లేక ఒకమోపు దొంగిలిస్తున్న దరిద్రుడయినా ఎకరాలకు ఎకరాలు పట్టణాలకు తరలించే స్మగ్లరు ఏజెంటయినా ఒకటే. ఎవరిమీదయినా కాల్పులు జరపవచ్చు, వాళ్ళు చస్తే చావవచ్చు.

ఒక దశాబ్దం కంటె ముందు కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త అడవుల చట్టం ముసాయిదాను రూపొందించింది. దానిలో అనేక అంశాలతోపాటు, స్మగ్లింగ్‌ను నిరోధించడానికి అటవీ శాఖకు పోలీసు అధికారాలు ఇవ్వాలనే ప్రతిపాదనకూడా ఉండేది. ఆ చట్టం వల్ల దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులలో చాలా వ్యతిరేకత వచ్చింది. చాలా నిరసన వ్యక్తమయింది. తాత్కాలికంగా దానికి బ్రేకు పడింది. మనవాళ్ళు ఏ చర్చలేకుండా, ఎవరికీ తెలియకుండా ఆ చట్టంలోని ఒక అంశాన్ని (అటవీశాఖకు పోలీసు అధికారులు ఇవ్వడం) జి.వో. చేసి గప్‌చుప్‌గా వాడుకుంటున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు రోజురోజుకు దిగజారుతున్నాయి. కరువు అనేది ఎప్పుడో ఎక్కడో వచ్చేదికాక ప్రతి సంవత్సరం కొన్ని కోట్ల జనాభాకు నిత్యజీవిత అనుభవం అయింది. ముందునుండి వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాలేకాదు, పచ్చటి అడవులు కూడా కరువు వాతపడుతున్నాయి. మరొకవైపు ప్రకృతి వనరులను ప్రజలచేతినుండి తీసివేసి పెత్తందార్ల చేతుల్లో పెట్టే రాజకీయ ఆర్థిక విధానం సాగుతూ ఉంది. అడవులు, కాలువలు, చెరువులు, మైదానాలు, తోపులు - అన్నిటిమీదా ప్రజలు హక్కులు కోల్పోతున్నారు. అన్నీ పెత్తందార్ల పాలవుతున్నాయి. దీని ఫలితంగా ప్రజల జీవితమే ఒక నేరమయిపోతున్నది. మరొకవైపు జీవించడం కోసం నేరాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది.

నేరాన్ని గురించి, నేర నివారణ గురించి ఆలోచించేటప్పుడు ఈ విషయాన్ని మరిచిపోతే కష్టం. మరచిపోయి ఆలోచిస్తే అటవీశాఖ చేతికి తుపాకులు ఇవ్వడం ఎందుకు తప్పో అర్థంకాదు. పోలీసులు దొంగతనాలు ఒప్పించడానికి లాకప్పులో బందీలకు రోకలిబండలు ఎక్కిస్తే అదెందుకు తప్పో అర్థం కాదు. పోలీసుల తుపాకీ అటవీ సిబ్బంది చేతిలోకి వచ్చింది. రేపు ఎక్సైజ్ సిబ్బందికీ విజిలెన్స్ సిబ్బందికీ ఆఖరుకు రెవెన్యూ సిబ్బందికీ కూడా ఇస్తామంటే దానిని ఎందుకు వ్యతిరేకించాలో అర్థంకాదు.

## సైనిక ప్రతీకారం

కంటికి కన్ను పంటికి పన్ను ప్రతీకారం తీర్చుకునే హక్కు చట్టంలో ఎవరికీ లేదు. ఎవరికి ఏ అన్యాయం జరిగినా పరిష్కారం కోర్టుల ద్వారా పొందవలసిందేనని చట్టం అంటుంది. వ్యక్తిగత ప్రతీకారాన్ని ఆమోదిస్తే అది అటవికరాజ్యం అవుతుందని చట్టం అంటుంది. ప్రతీకార సిద్ధాంతాన్ని నమ్మే రాజకీయ పక్షాలకు తీవ్రవాదులు అన్న బిరుదు ఇచ్చి వాళ్లను నిర్దాక్షిణ్యంగా అణచేస్తుంది ప్రభుత్వం.

కానీ ప్రతీకార సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మడమేకాక విజయవంతంగా ఆచరణలో పెట్టే వ్యవస్థ మన భద్రతా వ్యవస్థ. అంటే సైన్యం, పారామిలిటరీ, పోలీసులు. వాళ్లమీద ఎవరయినా దాడిచేస్తే ఒకటికి పది ప్రతీకారం తీర్చుకోవటం ఈ భద్రతా సిబ్బంది ఆనవాయితీ. మనరాష్ట్రంలో అనేక ఎన్కౌంటర్లు వాస్తవానికి పోలీసులపైన నక్సలైట్లు చేసిన దాడులకు ప్రతీకారంగా జరిగిన నగ్నమయిన హత్యలే. ఈ ప్రతీకార హత్యలను పోలీసులు హక్కుగా భావించి అమలు చేస్తున్నారు. మొన్న డిఐజి వ్యాస్ మృతదేహం వెంట రాజధాని నగరంలో ఊరేగింపుగా పోలీసు సిబ్బంది 'ఒక హత్యకు వంద హత్యలు' అని బాహాటంగా నినాదం ఇస్తుంటే ప్రశ్నించేవాళ్ళు, వాళ్ల నోరు మూయించేవాళ్లు ప్రభుత్వంలో లేకపోయారు.

ఈ కోవకు చెందిన అతి ఘోరమయిన సంఘటన జనవరి 6వ తేదీన కాశ్మీర్‌లోని సోపోర్‌లో జరిగింది. హిజ్బుల్ ముజాహిదీన్ సాయుధ దళానికి సైన్యానికి మధ్య ఎన్కౌంటర్ జరగగా సైన్యం పేల్చినతూటాలు పొరపాటుగా హిజ్బుల్ ముజాహిదీన్ వారు రహస్యంగా ముందునుండే దాచి ఉంచిన స్థావరానికి తగిలి అది పేలిందని ఆ ప్రమాదంలో 43 మంది చనిపోయి చాలా ఆస్తినష్టం జరిగిందని సైనిక అధికారులు ప్రకటించారు. కానీ జరిగింది అది కాదు. హిజ్బుల్ ముజాహిదీన్ దళానికి సైన్యానికి జరిగిన ఎన్కౌంటర్‌లో ఒక సైనికుడు చనిపోయాడు. అంతే, దానితో రెచ్చిపోయిన సైనికులు ముజాహిదీన్ల సంగతి మరచిపోయి ఊరిమీద పడ్డారు. కనిపించిన వారినందరినీ కాల్చారు. షాపులు దోచుకున్నారు. తగలబెట్టారు. జనాన్ని ఇళ్ల నుండి బయటకు లాగి హతమార్చారు. 43 మంది చనిపోయి ఇళ్లూ ఆఫీసులూ షాపులూ ధ్వంసం అయిన తరువాతగానీ వాళ్ల ప్రతీకారవాంఛ చల్లారలేదు.

అయినా 'ఒక హత్యకు వందహత్యలు' కాలేదనుకోండి – పదిరెట్లుమాత్రమే అయ్యాయి.